క్లుప్తంగా

సర్వభూపాల వాహనంపై వెంకన్న



సర్వభూపాల వాహనంపై స్వామివారు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు భక్తులను అలరిస్తున్నాయి. ఆరో రోజు శనివారం నీరుగట్టువారిపల్లె వాసులు ఉభయదారులుగా స్వామి సర్వభూపాల వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ, భజన, లలిత సహస్రనామ ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై ప్రత్యేక పూజలు



పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గౌరమ్మతల్లి, ఏనుమల్లమ్మ ఆలయాలను సందర్శించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. నియోజకవర్గంలో పుష్కలంగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కున్నారు. ఆమె వెంట సర్పంచు కె.జ్యోతి, మండల కన్వీనర్ చౌడేశ్వర్,నాయకులు శ్రీనివాసులు, రెడ్డప్పరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా నరసింహస్వామి జయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

మదనపల్లె సిటీ : స్థానిక అనపగుట్టలో వెలసిన శ్రీ అభయ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుదర్శన నరసింహ హోమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమం ఆలయ కమిటీ నిర్వాహకులు మల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ

కలికిరి : మండలంలోని మునెళ్ళపల్లి గ్రామం మూరేవాండ్లపల్లిలో వెలసిన శ్రీఅంకాలమ్మ వార్షిక జాతర శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉదయం గ్రామంలో పోతురాజు ఊరేగింపు నిర్వహించారు. సాయంత్ర అమ్మవారి గెరిగలు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాదులు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి పుట్టించి నుంచి సారె సమర్పణ, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. సోమవారం ఉదయం అమ్మవారికి గెరిగలు సమర్పణ, అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మురళి నాయక్‌కు ఘన నివాళి



జవాన్ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

పెద్దమండ్యం : భారత్ పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళి నాయక్‌కు స్థానికులు ఘనంగా నివాళులు అర్పించారు. పెద్ద మండ్యం బస్టాండు కూడలిలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి జోహార్లు పలికారు. మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. జవాన్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

- జిల్లాలో 20,923 నమూనాల సేకరణ లక్ష్యం
- ఈనెల15 తేదీ వరకు సేకరణకు గడువు
- భూసార పరీక్షలకు ఇదే అనువైన సమయం
- భూమిలో సమతుల్యత సాధించడమే లక్ష్యం



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

గుర్రంకొండ : ఎట్టకేలకు ప్రభుత్వం భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టుంది. తద్వారా పంటల సాగులో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది. జిల్లాలో 20,923 పంట పొలాల మట్టినమూనాల సేకరణే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఈనెల 15 వరకు ప్రభుత్వం గడువు విధించింది. భూసార పరీక్షలకు ఇదే అనువైన సమయం. సారం కోల్పోయిన భూమిలో పోషక విలువలు సమతుల్యత సాధించడమే ఉద్దేశ్యం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని రైతుసేవా కేంద్రాల్లో మట్టిసేకరణ పనులు చేపడుతుండటం గమనార్హం.

ఏడాది, మూడేళ్ల కొకమారు భూసార పరీక్షలు

నీటి సౌకర్యం అనగా బోర్లు, బావులు, సాగునీటి కాలువల ద్వారా ఏడాది పొడవునా నీటి సౌకర్యం ఉన్న పొలాల్లో ఏడాదికొక మారు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. ప్రతి మూడు సీజన్‌ల కొకమారు భూసార పరీక్షలు చేయించుకోవడం వలన రైతుకు మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. వర్షాధార పంటల సాగు భూముల్లో అనగా కేవలం ఏడాది పొడవునా కురిసే వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసే మెట్ట భూముల్లో మూడేళ్ల కొకమారు భుసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు పంటలు సాగు చేసిన ప్రతిసారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షలో భూమిలో ఎంతమేరకు వీటి శాతం తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంటసాగు చేసే ముందు పొలంలో తగినంత మేరకు వీటిని పిచికారి చేస్తే భూసారం మళ్ళీ యథాస్థితికి చేరుకొని మంచి పంట దిగుబడి సాధించవచ్చు.

ఏప్రిల్, మే అనుకూలం

భూసార పరీక్షల కోసం పొలాల్లో గానీ, భూమిలో మట్టినమూనాలను సేకరించేందకు ఏప్రిల్, మే నెలలు అనుకూలంగా ఉంటాయి. ఏడాదిలో ఈరెండు నెలల్లో చాలా వరకు పొలాల్లో పంటల సాగు ఉండదు. దీంతో బీడు భూములు అధికంగా ఉంటాయి. అప్పుడు మట్టినమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయనేది వ్యవయసాయాధికారుల నమ్మకం.

ఎనిమిది చోట్ల మట్టిసేకరణ

భూసార పరీక్షల్లో భాగంగా ఒక పొలంలో ఎనిమిది చోట్ల మట్టి నమునాలను సేకరిస్తారు. అవి వర్షాధార భూములైనాసరే, నీటి సౌకర్యం ఉన్న పొలాలైన సరే మట్టిసేకరణ విధానం ఒకేలా ఉంటుంది. పొలం నలుమూలల ఎనిమిది చోట్ల వీ ఆకారంలో తవ్వి ఒక చోట అరకిలో చొప్పున మట్టిని నమూనాలను సేకరిస్తారు. తరువాత మట్టిమొత్తాన్ని ఒకేచోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు.

21 రోజుల్లో ఫలితం

భూసార పరీక్షల నిమిత్తం సేకరించిన మట్టి నమూనాలను వ్యవసాయశాఖ ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు. వీటి ఫలితాలను 21 రోజుల తరువాత ప్రకటిస్తారు. ఆర్బీకే సిబ్బంది భూసార పరీక్షల ఫలితాన్ని సదరు పొలం రైతుకు తెలియజేస్తారు. తద్వారా సదరు పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్‌తో పాటు ఉదకజనిక సూచిక, సేంద్రీయకర్బనం వంటివి ఎంత మేరకు ప్రస్తుతం భూమిలో ఉన్నాయో ఫలితాలు సూచిస్తాయి. దీంతో పొలంలో భుసారాన్ని పెంపొందించేందకు ఏలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో సూచిస్తారు.

స్థూల, సూక్ష్మపోషకాల సమతుల్యత

పంటలు సాగు చేసే పొలాల్లో, చేలల్లో స్థూల, సూక్ష్మపోషకాల సమతుల్యత భూసార పరీక్ష ద్వారా సరి చేసుకోవాల్సి ఉంటుంది. పొలాలను దక్కుల చేసే సయయంలోనూ, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పొషకాల మందులను వినియోగించాల్సి ఉంటుంది.

72.4 శాతం మేరకు మట్టిసేకరణ పూర్తి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 72.4 శాతం మేరకు పొలాల్లో మట్టినమూనా సేకరణ పనులు పూర్తి అయ్యాయి. ఈనెల 15 తేదీలోగా లక్ష్యం చేరుకోవాలనే ఉద్దేశంతో పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 15150 మట్టినమూనాలను సేకరించారు. మిగిలిన నమూనాలను గడువులోగా సేకరించాల్సి ఉంది.

భూ సారం తెలుసుకోవచ్చు



భు సార పరీక్షల ద్వారా భూమిలోపల ఎంత మేరకు సారం ఉందో తెలుసుకోవచ్చు. తద్వారా భూములు, పొలాల్లోని లోటు పాట్లు తెలుసుకొని సరిచేసుకొనే అవకాశం ఉంటుంది. భూమి లోపల పోషకవిలువలు ఎంతమేరకు ఆవసరమో తెలుసుకొని భూమిని మళ్లీ సారవంతం చేసుకొనేందకు అవకాశముటుంది. – వెంకటరమణ, చింతలవారిపల్లె

మట్టినమూనాలు సేకరిస్తున్నారు



ఇప్పటికే గ్రామాల్లో ఆర్బీకే సిబ్బంది పొలాల్లో మట్టినమూనాలు సేకరిస్తున్నారు. 21 రోజుల తరువాత భూసార పరిక్షల ఫలితాలు రైతులకు తెలియజేస్తాం. సదరు రైతు పొలంలో ఉన్న లోపాలను తెలియజేసి లోపాలు సరిచేసుకొనే సూచనలు, సలహాలు వారికి ఇస్తాం. ఇవి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి. – రత్నమ్మ, ఏఓ, గుర్రంకొండ

భూములు సారవంతం చేసుకోవచ్చు



భూసార పరీక్షలతో పొలాలు, భూములు సారవంతం చేసుకోవచ్చు. ప్రతి రెండు, మూడు సంవత్సరాల కొకమారు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. గుల్లబారిపోయిన భూములు భూసార పరీక్షలతో సారవంతంగా మారుతాయి. తద్వారా అధిక పంట దిగుబడి సాధించ వచ్చు. – వాణీశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

పాకిస్తాన్‌కు దీటైన సమాధానం చెప్పాలి

- దేశమంతా ఒక్కటై సైనికులకు బాసటగా నిలవాలి
- వీరజవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిది
- సైనికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ ప్రత్యేకపూజలు



భారత సైనికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూజలు

మదనపల్లె రూరల్ : ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ, భారత్‌పై కవ్వింపుచర్యలకు పాల్పడుతున్న పాకిస్తాన్‌కు మన సైన్యం దీటైన సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పేర్కొన్నారు. దేశపౌరుల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేస్తున్న సైనికులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా భగవంతుడు చల్లగా చూడాలని శనివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముష్కర మూకలపై భారత సైనికులు చేస్తున్న పోరాటంలో ఘన విజయం సాధించాలని వెంకటేశ్వరుడిని ప్రార్థించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో దేశమంతా ఒక్కటై భారత సైనికులకు బాసటగా నిలబడాలని కోరారు. దేశంలో మనమంతా ధైర్యంగా, స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామంటే... సైన్యం దయవల్లేనన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి మనల్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికులు, వారి ధైర్యసాహసాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనన్నారు. దేశ ప్రజల రక్షణలో నిమగ్నమై ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికులందరికీ అండగా నిలవాలన్నారు. యుద్ధభూమిలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. వారి కుటుంబసభ్యులకు వైఎస్సార్ సీపీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. గిరిజన బిడ్డ దేశభద్రతలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి.. చిన్న వయస్సులోనే అశువులు బాయడం బాధాకరమన్నారు. జమ్ముకశ్మీర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్ ఈనెల 13న శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండాకు వెళ్లి పరామర్శిస్తారన్నారు. భారత సైన్యానికి కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రజలందరూ మద్దతుగా ఉండాలన్నారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఈ ధర్మయుద్ధంలో భారత సైన్యం విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సర్వమత ప్రార్థనలు జరపాల్సిందిగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకావెంకటాచలపతి, ఎస్ఆర్‌ఎ దండుశేఖర్‌రెడ్డి, మయూరి రఘునాథరెడ్డి, కౌన్సిలర్లు ఈశ్వర్‌నాయక్, పెరవలి రాజేష్, నాయకులు శీలంరమేష్, మునిశేఖర్, కొత్తపల్లె మహేష్, పూజారిచరణ్, ఆర్టీఏ నూర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావు ఆశయసాధనకు మాలలు ఏకం కావాలి



పీవీ రావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం

మదనపల్లె రూరల్ : అంబేడ్కర్ ఆలోచనా విధానంతో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన పీవీ రావు ఆశయసాధన కోసం మాలలు అంతా ఏకం కావాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం అన్నారు. శనివారం మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పీ.వీ.రావు జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యమలా సుదర్శనం మాట్లాడుతూ.. దళితుల హక్కులు, ఐక్యత కోసం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు స్థాపించి, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ చెల్లదని తేల్చి చెప్పిన మహనీయుడు పీవీ.రావు అన్నారు. ఎస్సీ,ఎస్టీ వర్గాల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ఉద్యమంలో తుదిశ్వాస వరకు పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండామనోహర్, అధికార ప్రతినిధి మల్లెలమోహన్, కార్యదర్శి వేములచంద్రయ్య, వీరనాల మాణిక్యం, రమణ, అప్పయ్య, గంగాధర్, సురేంద్ర, భరత్, బెల్లం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి రుణం తీర్చుకోలేనిది



పాదపూజ చేస్తున్న చిన్నారులు

మదనపల్లె రూరల్ : అమ్మ ప్రత్యక్ష దైవమని, ఎన్ని జన్మలెత్తినా, ఎన్ని సేవలు చేసినా కన్నతల్లి రుణం తీర్చుకోలేమని సీడీపీఓ సుజాత అన్నారు. శనివారం పట్టణంలోని గజ్జలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్ డే సందర్భంగా తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ చిన్నారులందరూ తమ తల్లులకు కాళ్లు కడిగి పాదపూజ చేసి ఆశీర్వచనాలు అందుకున్నారు. తల్లుల బొమ్మను గీసి, పిల్లల చేత రంగులు వేయించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాత మదర్స్ డే ఆవశ్యకతను వివరించారు. అమ్మతనం కన్నా కమ్మనైనది ఈ సృష్టిలో లేదని, అమ్మను అందరూ దైవంగా ఆరాధించి పూజించాలన్నారు. అమ్మ లేకుంటే సృష్టి లేదని, బిడ్డకు తొలి గురువు తల్లేనన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ సుమిత్ర, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లికివందనం కార్యక్రమం

పీలేరు : మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికివందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం అంగన్‌వాడీకేంద్రాల్లో పిల్లలచే తల్లులకు పాదపూజ చేపించి వారిచే ఆశీర్వాదం ఇప్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాజమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలకు ఇచ్చే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు స్వర్ణ, స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేషపూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనిత్రయోదనిను పురస్కరించుకొని వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు నృసింహస్వామి జయంతి వేడుకలు:

తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం, చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయాల్లో ఆదివారం స్వామివార్ల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారి నాగరాజ తెలిపారు. తరిగొండ ఆలయంలో ఉదయం 7 గంటలకు స్వామివార్లకు స్నపన తిరుమంజనం, 10 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబకు పుష్పాంజలి, 10.30గంటలకు స్వామివారికి కల్యాణోత్సవం, గ్రామోత్సవం, సాయంకాలం ఆరుగంటలకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గోష్ఠిగానము, 7గంటలకు హరికథ కాలక్షేప కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు.

అనీమియా రక్త పరీక్షలు తప్పనిసరి



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

గుర్రంకొండ : సికిల్‌సెల్ అనీమియా రక్త పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, వాల్మీకిపురం టీబీ సబ్‌యూనిట్ అధికారి నాగిరెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని తరిగొండ, సింగంవారిల్లె గ్రామాల్లో 2047- సికిల్‌సెల్ అనీమియా నిర్మూలన మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 39 మందికి అనీమియా రక్త పరీక్షలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ వ్యాధి వారసత్వంగా వచ్చే ఎర్ర రక్తకణముల వ్యాధి అన్నారు. జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందని తెలిపారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకొవడం కష్టంగా మారడం వంటివి ఈవ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ మద్దమ్మ, ఏఎన్ఎంలు చంద్రవతి, నాగరత్న, ఆశావర్కర్లు శ్రావణి, రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా అయ్యపునాయునిచెరువు ఆక్రమణ



ఆక్రమణకు గురైన అయ్యపునాయునిచెరువు స్థలం

పీలేరు : పీలేరు పట్టణంలో ఉన్న అయ్యపునాయుని చెరువు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతోంది. స్థానిక షుకూర్ థియేటర్ సమీపంలో చెరువుకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమణదారులు చదును చేసి షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున చెరువు ఉంది. ఈ ప్రాంతంలో భూములు అధిక ధరలు పలుకుతున్నాయి. ఆక్రమణ దారులు గుట్టుచప్పుడు కాకుండా చెరువు స్థలాన్ని కొంచెం కొంచెం ఆక్రమించుకుంటూ విస్తరించుకుంటూ పోతున్నారు. ఇప్పటికే చెరువు చుట్టూ చెరువు స్థలం ఆక్రమించుకోవడంతో చాలా వరకు కుచించుకూ పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన అండర్-16 క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

కురబలకోట : మండలంలోని అంగళ్లు గ్రామం కొత్త హైవే దగ్గర కాకర్ల సుధీర్ ఎస్టేట్ వద్ద 38 రోజులుగా సాగిన కెఎస్ఎస్‌బి ఫరీద్ బాబా మెమోరియల్ అండర్ -16 క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో అట్టహాసంగా ముగిసింది. క్రీడాభిమానులకు నూతన ఉత్సాహాన్ని నింపింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 12 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో మదనపల్లెకు చెందిన కెఎస్ఎస్‌బీ అండ్ ఎంసీఏఏ టీమ్ విన్నర్‌గా నిలిచారు. తిరుపతికి చెందిన శ్రీనివాస క్రికెట్ క్లబ్ రన్నర్‌గా నిలిచింది. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోషియేషన్ ప్రెసిడెంట్ విజయకుమార్, కెఎస్ఎస్‌బీ అధ్యక్షులు నూర్‌బాబా చేతుల మీదుగా విన్నర్స్‌కు, రన్నర్‌కు కప్ అందించారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్, ఇంగ్లీషు విల్లో బ్యాట్ మెమెంటో, బౌలర్‌కు స్పైక్ షూస్ అందించారు. ప్రతిభ చాటిన వారికి అవార్డులను అందించారు. టోర్నమెంట్ నిర్వాహకులు ఖాదర్‌బాబా మాట్లాడుతూ యువకుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ఈ టోర్నమెంట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు తెలిపారు. మాజీ రంజీ ప్లేయర్ ఫయాజ్ అహ్మద్, సీడీసీఏ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్, ఎంసీఏ అధ్యక్షులు మాలిక్, ఎంసీఏ అకాడమీ కోచ్ జనార్దన్, షేకి, శివ, భార్గవ్, బీసీసీఐ వీడియో అనలైజర్ అబ్దుల్ రెహ్మాన్, హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ పాల్గొన్నారు.

ఇద్దరు దివ్యాంగులకు డాక్టరేట్





డాక్టరేట్ అందుకుంటున్న వెంకటరమణ, వెంకటాచలపతి

పీలేరు : పీలేరుకు చెందిన ఇద్దరు దివ్యాంగులకు బెంగళూరు భారత్ వర్చువల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పట్టణానికి చెందిన కె. వెంకటరమణ, వెంకటాచలపతి ఇద్దరూ దివ్యాంగులు 2007లో ఆదర్శ వికలాంగుల సేవా కమిటీ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వారి సేవలను గుర్తించిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం బెంగళూరులో యూనివర్సిటీ డైరెక్టర్ తంగవేల్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

మదనపల్లె సిటీ : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ప్రశ్నాపత్రాల బాక్సులను శనివారం మదనపల్లె వన్,టు టౌన్ పోలీస్‌స్టేషన్లల్లో భద్రపరిచారు. ఇంటర్మీడియట్ రూట్ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈనెల 12వతేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

కార్మికుడికి గాయాలు

మదనపల్లె సిటీ : మదనపల్లె సమీపంలోని ఎర్రగాని మిట్ట వద్ద రోడ్డు పనులు చేస్తున్న ఓ కార్మికుడు శనివారం ప్రమాదశాత్తు క్రషర్‌పై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బీహార్ రాష్ట్రం సజరియా ప్రాంతానికి అనూజ్‌చౌదరి(35) రోడ్డు పనులకు రాళ్ల క్రషింగ్ చేస్తుండగా ప్రమాదశాత్తు క్రషింగ్ మిషన్‌లో పడ్డాడు. గమనించిన స్థానిక కూలీలు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

జానపద గేయాలు.. జన రంజికాలు

పీలేరురూరల్ : జానపద గేయాలు జనరంజికాలు అని పీలేకు చెందిన కవి జలకనూరి మురళీధర్‌రాజు అన్నారు. శుక్రవారం తిరుపతి ఎస్వీయూ సెనైట్ హాల్‌లో ప్రజా కళావేదిక తరపున మనపల్లె జానపద జాతర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మురళీధర్‌రాజు పాల్గొని తాను స్వయంగా రాసిన గాజుల పాట ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనపదం పల్లె ప్రజల నుంచి పుట్టిందని, జానపద గేయాలు గ్రామీణ ప్రజల సంస్కృతిని, భాషను, అలవాట్లను, బంధు సంబంధాలను తెలియజేస్తుందని తెలిపారు. అనంతరం జలకనూరి మురళీధర్‌రాజును ఘనంగా సన్మానించరు.

నేడు రక్తదాన శిబిరం

మదనపల్లె సిటీ : మాతృమూర్తుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్‌విషర్స్ వ్యవస్థాపకులు గిరీష్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్లడ్‌బ్యాంకులో రక్తదానం శిబిరం నిర్వహిస్తామన్నారు. రక్తదానం చేసే వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి శనివారం తెలిపారు. బీఎలో 95 శాతం, బీఎస్సీలో 96, బీకాంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందిచారు.

వైభవంగా అమ్మవారి రథోత్సవం

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం అమ్మవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో మేళతాళాలలు, కోలాటాల నడుమ కన్నుల పండుగగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై రద్దీ

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై శనివారం రద్దీ నెలకొంది. వారాంతం కావడంతో కొండపై ప్రభుత్వ, ప్రైవేటు అతిథి గృహాలన్నీ ఫుల్ అయ్యాయి. గదుల కొరత నెలకొంది. కర్ణాటక, తమిళనాడుకు చెందిన పర్యాటకులు అధికంగా విడిది చేశారు. ముందుగానే గదులు బుక్ చేసుకోవడంతో నేరుగా వచ్చే సందర్శకులకు గదులు సరిపోక ఇబ్బందులు పడ్డారు. దీనితో పలువురు వెనుదిరిగి వెళ్లారు. వేసవి సెలవుల కారణంగా ఆదివారం కొండపై రద్దీ తీవ్రం కానుంది.

బీజేపీ ఆధ్వర్యంలో శత్రు సంహార హోమం



హోమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మదనపల్లె రూరల్ : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారతసైన్యానికి, ప్రభుత్వానికి శక్తిని ప్రసాదించాలని బీజేపీ నాయకులు బండి ఆనంద్ ఆధ్వర్యంలో శనివారం శత్రు సంహార హోమం నిర్వహించారు. సీటీఎం రోడ్డు మంజునాథస్వామి ఆలయంలో వేదపండితులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన రాయలసీమ కోకన్వీనర్ రామదాస్ చౌదరి మాట్లాడుతూ...ప్రస్తుత పరిస్థితుల్లో దేశప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఒక్కటిగా ఉంటూ సైన్యానికి మనోధైర్యం ఇవ్వాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం తప్పకుండా పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెబుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారదరెడ్డి,కిరణ్, జర్మన్‌రాజు,జంగాల శివరాం, మాజీసైనికుల సంఘం డివిజన్ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.